క్లుప్తంగా

మునగపాకలో 'గడప గడపకు' నేడు

మునగపాక : మునగపాకలో శనివారం ఉదయం 6 గంటల నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే యూవీ రమణమూర్తిరాజు, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్ తదితరులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ లబ్ధిని వివరించడంతోపాటు, ప్రజా సమస్యలు అడిగి తెలుసుకుంటారని పేర్కొన్నారు. పార్టీ నేతలు, అధికారులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అచ్చియ్యనాయుడు కోరారు.

రోడ్డు భద్రతపై అవగాహన ర్యాలీ



రోడ్డు భద్రతపై మానవహారం

కోటవురట్ల: రహదారి భద్రత నిబంధనలు పాటించండి.. క్షేమంగా ఇంటికి చేరండి.. అంటూ స్వయం సహాయక సంఘాల సభ్యులు నినదించారు. మండలంలోని కె.వెంకటాపురం యండపల్లి గ్రామాలలో స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ర్యాలీగా వెళ్లి, మానవహారంగా ఏర్పడి రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం రమణకుమారి, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశుని కల్యాణం



మంగవరం వేంకటేశ్వరాలయంలో స్వామి కల్యాణోత్సవం

పాయకరావుపేట : మండలంలోని మంగవరం గ్రామంలో ఉన్న శ్రీ పద్మావతి, గోదాదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు తమిడిశెట్టి గోపి, తమిడిశెట్టి శ్రీను ఆధ్వర్యంలో నిర్వహించిన స్వామివారి కల్యాణ మహోత్సవంలో భక్తులు పాల్గొన్నారు. మండలంలోని మంగవరం, అరట్లకోట, సత్యవరం, గుంటపల్లి గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరై, స్వామిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం భక్తులకు భారీ అన్నసమారాధన నిర్వహించారు.


పట్టణంలో కల్వర్టుల నిర్మాణం



బృందావనంలో కల్వర్టు నిర్మాణ పనులు

పాయకరావుపేట : పట్టణం పరిధిలోని పలు కాలనీల్లో కల్వర్టుల నిర్మాణానికి పంచాయతీ పాలకవర్గం ఆమోదం తెలిపినట్టు గ్రామ పంచాయితీ కార్యదర్శి జె.చంద్రశేఖర్ తెలిపారు. ఎంతో కాలంగా శిథిలావస్థలో ఉన్న కల్వర్టుల పునర్నిర్మాణానికి పాలకవర్గం శ్రీకారం చుట్టింది. దీంతో ఆయా ప్రాంతాల్లో కల్వర్టులు నిర్మాణం పనులు చురుగ్గా సాగుతున్నాయి. దీర్ఘకాలంగా తామెదుర్కొంటున్న కల్వర్టు సమస్యలు తీరనుండటంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అధ్వానంగా గ్రామీణ రోడ్లు



కొడవటిపూడి మెయిన్‌రోడ్డు

కోటవురట్ల : వర్షాలకు గ్రామీణ రహదారులు మరింత దారుణంగా తయారయ్యాయి. లింగాపురం-కొడవటిపూడి రోడ్డు, ఇందేశమ్మవాక ఘాట్ రోడ్డు, అన్నవరం, రాజుపేట రహదారులు శిథిలావస్థకు చేరుకుని, పెద్ద పెద్ద గోతులతో వాహనదారులకు నరకాన్ని తలపిస్తున్నాయి. ప్రస్తుత వర్షాలకు ఈ రోడ్డులో వెళ్లాలంటే జనాలు భయపడుతున్నారు. గోతుల్లో చేరిన వర్షపు నీటితో రోడ్డేదో.. గొయ్యేదో తెలియక ప్రమాదాలపాలవుతున్నారు. రోడ్డెక్కితే ఇంటికి చేరేంత వరకు ప్రాణాలు అరచేత పెట్టుకోవాల్సి వస్తోందని వాహనదారులు వాపోతున్నారు. ప్రధానంగా కొడవటిపూడి, ఇందేశమ్మవాక ఘాట్‌రోడ్లను మరమ్మతు చేయాలని కోరుతున్నారు.

ప్రజా సమస్యలపై తక్షణ స్పందన

- అధికారులకు ఎమ్మెల్యే కన్నబాబురాజు దిశానిర్దేశం
- పూడిమడకలో ముగిసిన 'గడప గడపకు మన ప్రభుత్వం'



అధికారులకు దిశానిర్దేశం చేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబురాజు

అచ్యుతాపురం(అనకాపల్లి) : అచ్యుతాపురం మండలంలోని పూడిమడక సచివాలయం-1, 2 పరిధిలో నిర్వహిస్తున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యూవీ రమణమూర్తిరాజు(కన్నబాబు రాజు) చేతుల మీదుగా దివంగత మహానేత వైఎస్సార్, స్వామి వివేకానంద విగ్రహాలను ఆవిష్కరించారు. స్వామి వివేకానంద కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించారు. ముందుగా గ్రామంలో పర్యటించి ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలును ఆరా తీశారు. నవరత్నాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని సమస్యలు, ఇతరత్రా అంశాలపై ముగింపు సభలో ప్రస్తావించారు. ప్రజల వినతుల పట్ల అధికారులు తక్షణమే స్పందించాలని ఆదేశించారు.

రానున్న సార్వత్రి ఎన్నికల్లో సంక్షేమ సారథి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ అధికారంలోకి తెచ్చేందుకు ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో కృషి చేయాలని పిలుపునిచ్చారు. గత, ప్రస్తుత ప్రభుత్వాల పాలన మధ్య వ్యత్యాసాలను గమనించి, సీఎం జగన్‌కు మద్దతుగా నిలవాలని అభ్యర్థించారు. వలంటీర్లకు, సచివాలయ ఉద్యోగులకు వాటర్ ప్రూఫ్ బ్యాగ్‌లను అందించారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార వర్మ, ఎంపీపీ భర్త కోన బుజ్జి, జెడ్పీటీసీ లాలం రాంబాబు, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు నర్మాల కుమార్, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు దేశంశెట్టి శంకరరావు, సర్పంచ్ చేపల సుహాసిని, చేపల వెంకటరమణ, పూడిమడక నేతలు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

'క్రీడా పోటీలను విజయవంతం చేయాలి'



పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

మునగపాక : మేడే క్రీడా సాంస్కృతిక ఉత్సవాలను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి వీవీ శ్రీనివాసరావు కోరారు. మండలంలోని నాగులాపల్లి, తోటాడ, గవర్ల అనకాపల్లి, వాడ్రాపల్లి తదితర గ్రామాల్లో పిల్లలకు క్రీడా పోటీలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 7 వరకు క్రీడాపోటీలు నిర్వహించి, అదే రోజు రాత్రి గవర్ల అనకాపల్లిలో బహుమతులు అందిస్తామన్నారు. ఆ రోజు రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు దేశభక్తి గీతాలు, జానపద గీతాలు, నృత్య ప్రదర్శనలు ఉంటాయన్నారు. సీఐటీయూ, సుందరయ్య విజ్ఞాన కేంద్రం, నెహ్రూ యూత్ కేంద్రం సంయుక్త నిర్వహణలో జరిగే మూడు రోజుల కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆళ్ల సూరిబాబు, రామలక్ష్మి, అంజలి, బేబీ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'ప్రత్యేక తరగతులను వినియోగించుకోండి'



పాటిపల్లి కేజీబీవీలో శిక్షణ తరగతులను పరిశీలిస్తున్న ఎంపీడీవో రవికుమార్

మునగపాక : ఇంటర్ విద్యార్థులు ప్రత్యేక తరగతులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో పి.రవికుమార్ కోరారు. ఇంటర్లో ఫెయిలైన విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక శిక్షణ శిబిరాల్లో భాగంగా పాటిపల్లి కేజీబీవీతో పాటు మోడల్ స్కూల్‌ను శుక్రవారం ఆయన సందర్శించారు. విద్యార్థులకు అందుతున్న శిక్షణను పరిశీలించారు. వెనుకబడిన విద్యార్థుల్లో ఆత్మ విశ్వాసం నింపాలన్నారు. విద్యార్థులు కూడా శిక్షణా శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆయన వెంట ఈవోఆర్డీ ఈశ్వరరావు పాల్గొన్నారు.

స్పందన అర్జీలపై సమీక్ష



స్పందన దరఖాస్తుదారులతో జిల్లా అధికారుల వీడియో కాన్ఫరెన్స్

ఎస్.రాయవరం : స్పందనలో వచ్చిన దరఖాస్తులపై దిగువ స్థాయి అధికారుల స్పందనపై జిల్లా అధికారులు వీడియోకాన్ఫరెన్స్ ద్వారా నేరుగా అర్జీదారులతో మాట్లాడినట్టు తహసీల్దార్ శ్యామ్‌కుమార్ తెలిపారు. గత సోమవారం కలెక్టర్ కార్యాలయ స్పందనలో ఇచ్చిన దరఖాస్తుదారులతో శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్, జేసీ, ఎస్పీ తదితర ఉన్నతాధికారులు అర్జీల పరిష్కారంపై విశ్లేషించారు. ఏ మేరకు పరిష్కారమయ్యాయి? జాప్యానికి కారణాలను సంబంధిత అధికారులనడిగి తెలుసుకున్నారు. వాటిని అర్జీదారులకు వివరించారు. సమస్య ఎప్పటిలోగా పరిష్కారమవుతుందో తెలిపారు. దీంతో అర్జీదారులు ఆనందం వ్యక్తం చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా తమ సమస్యల పరిష్కారంపై పర్యవేక్షణ చేయడం అభినందనీయమన్నారు. సమావేశంలో ఎంపీడీవో రామచంద్రమూర్తి, ఎస్‌ఐ ప్రసాద్ రావు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

వరి పొలంలో పాము కలకలం



దిమిలి సమీపంలోని వరి పొలంలో పాము

రాంబిల్లి : దిమిలి సమీపంలో రబీ వరి పొలంలో శుక్రవారం పాము కలకలం రేపింది. దొడ్డ లచ్చమ్మకు చెందిన వరి పొలంలో యంత్ర సాయంతో వరి కోత చేపట్టారు. అయితే గట్టును ఆనుకొని ఇద్దరు రైతులు కొడవళ్లతో వరి చేను కోస్తుండగా కోట నాగేష్ హఠాత్తుగా పామును చూసి చంపేశాడు. దీంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. ఆరు అడుగులు పొడవైన పొడ జాతి పామని, ఇది ప్రమాదకరమైందని రైతు లచ్చమ్మ తెలిపారు.

దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు



మునగపాకలో మజ్జిగ పంపిణీ చేస్తున్న తూర్పుకాపు సంఘ మండల అధ్యక్షులు సూరిబాబు

మునగపాక : వేసవి దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు దోహదపడతాయని తూర్పుకాపు సంఘ మండల అధ్యక్షుడు బలిరెడ్డి సూరిబాబు అన్నారు. వేసవిలో రాకపోకలు సాగించేవారు చలివేంద్రాలను వినియోగించుకోవాలన్నారు. మునగపాక పీఏసీఎస్ ఆవరణలో గ్రామస్తులు ఏర్పాటు చేసిన చలివేంద్రంలో భాగంగా శుక్రవారం ఆయన మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో వార్డు సభ్యురాలు బలిరెడ్డి లక్ష్మి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, పెద్దలు పెంటకోట వెంకటరావు, మొల్లేటి సత్యనారాయణ, కాండ్రేగుల మణికంఠ, జల్లేపల్లి కిష్టప్ప, వెలగా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా దుర్గమ్మ విగ్రహ ప్రతిష్ట



ప్రతిష్టించిన దుర్గాదేవి ఉత్సవ విగ్రహం



భరతనాట్యం చేస్తున్న బాలికలు

యలమంచిలి : మండలంలో పీఎస్‌ఆర్ పేట, పేటబయ్యవరం జంట గ్రామాల్లో నూతనంగా నిర్మించిన దుర్గాదేవి ఆలయంలో శుక్రవారం దుర్గాదేవి ఉత్సవ విగ్రహాన్ని వేద మంత్రోచ్చారణతో అత్యంత వైభవంగా ప్రతిష్టించారు. గత మూడు రోజులుగా అమ్మవారి ఆలయం వద్ద కుంకుమ పూజలు, యజ్ఞ హోమాలు జరిపి అమ్మవారి నూతన ఉత్సవ విగ్రహం, గరగలు, అమ్మవారి పాదాలు, వివిధ శివపార్వతుల విగ్రహాలను గ్రామాల్లో ఊరేగించారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన చేశారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా భరతనాట్యం, కోలాటం, చిటికల భజన విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో రెండు గ్రామాల సర్పంచ్‌లు గొన్నాబత్తుల శివ, మొగలపల్లి సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు ఊటకూటి శేఖర్, మొగ్గా గోవిందరావు, ఉత్సవ కమిటీ సభ్యులు జె్రిపోతుల వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులను వినియోగించుకోండి



మామిడివాడలో ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో కొండలరావు

రాంబిల్లి : ఉపాధి పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో కె.ఎస్.కొండలరావు సూచించారు. మామిడివాడ గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. కూలీలకు గిట్టుబాటయ్యేలా చర్యలు తీసుకోవాలని సాంకేతిక సహాయకులు రామారావును ఆదేశించారు. మస్టర్లను పారదర్శకంగా నమోదు చేయాలన్నారు.

గతుకుల రోడ్డుతో అవస్థలు



గతుకుల రోడ్డుపై వాహన చోదకుల ఇక్కట్లు

ఎస్.రాయవరం : అడ్డురోడ్డు నుంచి దార్లపూడి శివారు ఇందేశమ్మవాక నర్సీపట్నం ఆర్‌అండ్‌బీ రోడ్డు అధ్వానంగా మారింది. గత ఏడాదిగా ఈ రోడ్డు మరింతగా ఛిద్రమై వాహనదారులకు నరకం చూపిస్తోంది. ఇటీవల కురిసిన వర్షాలతో ఈ సమస్య మరింత దారుణంగా మారింది. రోడ్డుపైనున్న గతుకుల్లో నీరు చేరి, రోడ్డేదో.. గొయ్యేదో తెలియని అయోమయం నెలకొంది. ఈ రోడ్డు సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా, పరిష్కారానికి నోచుకోలేదని స్థానికులు వాపోతున్నారు. కనీసం మరమ్మతులైనా చేపట్టాలని కోరుతున్నారు. ఈ రోడ్డు మీదుగా రోజూ వేల సంఖ్యలో వాహనాల రాకపోకలుంటాయి. సుమారు 11 కిలోమీటర్లు మేర రోడ్డు పరిస్థితి దారుణంగా ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

జల్లూరులో హౌసింగ్ డే నేడు

కోటవురట్ల : జల్లూరు ఎస్సీ కాలనీలోని వైఎస్సార్ జగనన్న లే అవుట్‌లో శనివారం హౌసింగ్ డే నిర్వహించనున్నట్టు ఎంపీడీవో చంద్రశేఖర్ తెలిపారు. ఉదయం 10.30 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని అధికారులు, లబ్ధిదారులు, వలంటీర్లు హాజరు కావాలని కోరారు. లబ్ధిదారుల సమస్యలు తెలుసుకున్న అనంతరం కోటవురట్లలోని మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల స్థాయి అధికారులతో సమీక్ష ఉంటుందన్నారు.

ప్రతి శుక్రవారం స్పందనపై సమీక్ష

గంటన్నరపాటు నిర్వహణ-ఆర్డీవో చిన్నికృష్ణ



అర్జీదారులతో మాట్లాడుతున్న ఆర్డీవో చిన్నికృష్ణ

అనకాపల్లిటౌన్ : డివిజన్ పరిధిలో స్పందన అర్జీల పరిష్కారానికి నిర్దేశిత గడువుతో సంబంధం లేకుండా సత్వర పరిష్కారానికి కృషి చేస్తామని ఆర్డీవో చిన్నికృష్ణ అన్నారు. జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి వర్చువల్ సమావేశంలో భాగంగా స్థానిక ఆర్డీవో కార్యాలయంలో శుక్రవారం ఆయన అర్జీదారులనుద్దేశించి మాట్లాడారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్, జేసీ, ఎస్పీలు ప్రత్యేకంగా నిర్వహిస్తున్న స్పందన అర్జీదారుల సమావేశం భవిష్యత్‌లో ప్రతి శుక్రవారం ఉదయం 10 నుంచి 11.30 గంటల వరకు జరుగుతుందన్నారు. సమావేశంలో జిల్లాస్థాయిలో జిల్లా కలెక్టర్, జేసీ, ఎస్పీ, డివిజన్ స్థాయిలో ఆర్డీవో, డీఎస్పీ, మండల స్థాయిలో తహసీల్దార్, ఎంపీడీవో, సీఐలు, మండల సర్వేయర్ల సమన్వయంతో స్పందన అర్జీలను త్వరితగతిన ఎక్కడికక్కడ పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. స్పందన అర్జీల పరిష్కార సంతృప్తి శాతాన్ని పెంచుతామని స్పష్టం చేశారు. పరిష్కారానికి నోచుకోని అర్జీదారులకు కారణాలను కూడా తెలియజేస్తామన్నారు. అంతకుముందు 20 మందికిపైగా అర్జీదారులతో ఆర్డీవో, డీఎస్పీలు మాట్లాడి వారి సమస్యలను పరిష్కరించారు. కార్యక్రమంలో డీఎస్పీ సుబ్బరాజు, సమాచార హక్కు, వినియోగదారుల రక్షణ చట్టాల ఉద్యమకర్త కాండ్రేగుల వెంకటరమణ, వ్యవసాయదార్ల సంఘం కార్యదర్శి భీశెట్టి కృష్ణ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు సకాలంలో పట్టాదారు పుస్తకాలు



రైతులకు పట్టాదారు పుస్తకాలు అందిస్తున్న సర్పంచ్ మంగలక్ష్మి

మునగపాక : అర్హులైన రైతులకు సకాలంలో పట్టాదారు పుస్తకాలు అందిస్తున్నట్లు తిమ్మరాజుపేట సర్పంచ్ భీమిశెట్టి మంగలక్ష్మి తెలిపారు. జగనన్న శాశ్వత భూ హక్కు పథకం కింద రైతులకు శుక్రవారం పట్టాదారు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్న శాశ్వత భూహక్కు పథకం ద్వారా రైతులకు మేలు జరుగుతుందన్నారు. గతంలో పట్టాదారు పుస్తకం కోసం రైతులు కార్యాలయాల చుట్టూ తిరిగేవారని ప్రస్తుతం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పుణ్యమా అని రైతులకు సకాలంలో పుస్తకాలు అందుతున్నాయని కొనియాడారు. ఉప సర్పంచ్ కాండ్రేగుల జగన్, ఎంపీటీసీ శరగడం అప్పలనరసమ్మ, పీఏసీఎస్ డైరెక్టర్ ఆడారి వెంకట గణేష్, వీఆర్వో రమేష్, వార్డు సభ్యులు సత్యనారాయణ, జగన్, వైఎస్సార్‌సీపీ నేతలు రామభద్రనాయుడు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి దశలోనే విస్తృత ఆలోచనలకు నాంది



ప్రశాంతి కళాశాల వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న భారత్ అభియాన్ రీజనల్ కోఆర్డినేటర్ పావని

అచ్యుతాపురం(అనకాపల్లి) : విద్యార్థి స్థాయిలో విస్తృత ఆలోచనలకు నాంది పలకాలని ఏయూ ప్రొఫెసర్, ఉన్నత్ భారత్ అభియాన్ రీజనల్ కోఆర్డినేటర్ పావని అన్నారు. అచ్యుతాపురం మండలంలోని ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆమె ముఖ్య అతిథిగా మాట్లాడారు. ప్రతీ ఉన్నత విద్యాసంస్థ ఉన్నత్ భారత్ అభియాన్‌లో భాగమైతే గ్రామ పంచాయితీ అభివృద్ధి ప్రణాళిక, మహిళా సాధికారితకు కేంద్ర ప్రభుత్వం నిధులు సమకూరుస్తుందన్నారు. సంప్రదాయ చేతి వృత్తులకు సాంకేతికత జోడించే స్టార్టప్‌లకు కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహకాలను అందిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో బీవీకే కళాశాల అధ్యాపకులు నరసింహమూర్తి, కళాశాల కరస్పాండెంట్ ధర్మిరెడ్డి ప్రసాద్, ఎన్ఎస్ఎస్ అధికారి మాధవి, విద్యార్థులు పాల్గొన్నారు.

వాతావరణ మార్పులతో ఆరోగ్య జాగ్రత్తలు



తోటాడలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ అనిల్‌కుమార్

మునగపాక : వాతావరణంలో మార్పులు సంభవించే క్రమంలో ఆరోగ్య సమస్యలు ఎదురవుతాయని వైద్యాధికారి అనిల్‌కుమార్ హెచ్చరించారు. ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా తోటాడ ఆరోగ్య ఉపకేంద్రంలో శుక్రవారం వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున బయటకు వెళ్లేటపుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలాగే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. సర్పంచ్ దొడ్డి మంగవేణి కోటేశ్వరరావు, ఎంపీటీసీ కాండ్రేగుల వెంకటలక్ష్మిలు ఫ్యామిలీ డాక్టర్ సేవలను పరిశీలించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సీడ్స్ నుంచి ఉద్యోగుల్ని తొలగించవద్దు



బ్రాండిక్స్ సీడ్స్ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నబాబురాజు

అచ్యుతాపురం(అనకాపల్లి) : బ్రాండిక్స్ సీడ్స్ కంపెనీ నుంచి ఏ ఒక్క ఉద్యోగినీ తొలగించవద్దని ఎమ్మెల్యే కన్నబాబురాజు ఆదేశించారు. శుక్రవారం కంపెనీ యాజమాన్యంతో చర్చలు జరిపిన ఆయన ఎట్టి పరిస్థితుల్లోనూ ఉద్యోగులను తొలిగించవద్దని, ఉద్యోగులకు భద్రత ఉండాలని సూచించారు. ఇటీవల సీడ్స్ మహిళా ఉద్యోగులు తమ ఉద్యోగ భద్రతపై ఆందోళన చేపట్టిన నేపథ్యంలో యాజమాన్యంతో ఎమ్మెల్యే చర్చలు జరిపారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, మండల స్థాయి వైఎస్సార్‌సీపీ నేతలు, బ్రాండిక్స్ అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా పైడితల్లి ఘటం ఊరేగింపు



పైడితల్లి అమ్మవారి ఘటం ఊరేగింపులో గ్రామస్తులు

ఎస్.రాయవరం : మండలంలోని కొరుప్రోలు శ్రీ పైడితల్లి అమ్మవారి ఘటాల ఊరేగింపు గ్రామంలో ఘనంగా జరిగింది. పల్లె కులస్తుల ఆరాధ్య దైవం పైడితల్లి అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీధుల్లోకి వచ్చిన అమ్మవారి ఘటాన్ని దర్శించుకునేందుకు పోటీపడ్డారు. ఘటాన్ని తాకుతూ పసుపు కుంకమలు స్వీకరించారు. ఘటంలో అమ్మవారికి బియ్యం, పండ్లు కానులు వేశారు. డప్పులమేళాల మధ్య అమ్మవారి ఘటం ఊరేగింపుతో గ్రామంలో సందడి నెలకొంది. వారం రోజులపాటు అమ్మవారి ఊరేగింపు కార్యక్రమం నిర్వహించి 9న అమ్మవారికి ఘనంగా జాతర చేయనున్నట్టు ఉత్సవ కమిటీ వెల్లడించింది.

ఉచిత పశువైద్య శిబిరం



పశువైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న అరబుపాలెం సర్పంచ్ శ్రీనివాసరావు

మునగపాక : మేలుజాతి పశువుల పెంపకం ద్వారా ఆశించిన పాల దిగుబడులు సొంతం చేసుకోవచ్చని అరబుపాలెం సర్పంచ్ బొడ్డేడ శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని అరబుపాలెంలో శుక్రవారం రిలయన్స్ ఫౌండేషన్ ఏర్పాటు చేసిన ఉచిత పశువైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ పశు పోషణ పట్ల రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పాల సార కలిగిన పశువులను కొనుగోలు చేసుకోవాలన్నారు. శిబిరంలో వైద్యులు భాను, పద్మజలు పాల్గొని,75 పశువుల్ని పరీక్షించి, మందులు అందించారు. ఫౌండేషన్ మేనేజర్ తిరుమలరావు, పాల సంఘ అధ్యక్షులు బొడ్డేడ గంగాధర్, పీఏస్ కృష్ణ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఘనంగా శివపార్వతుల కల్యాణోత్సవం



కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చక స్వాములు



భక్తి తన్మయత్వంలో గ్రామస్తులు

కశింకోట : స్థానిక సర్వమంగళాంబ సమేత త్రిపురాంతకస్వామి ఆలయంలో శుక్రవారం శివపార్వతుల కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఏటా వైశాఖ మాసం పౌర్ణమి రోజు వార్షిక కల్యాణాన్ని నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా శివ పార్వతుల ఉత్సవ విగ్రహాలను అందంగా అలంకరించి శాస్త్రోక్తంగా వేద మంత్రాల నడుమ సంప్రదాయంగా కల్యాణం జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై కల్యాణాన్ని ఆద్యంతం తిలకించి, పులకితులయ్యారు. ఆలయ ప్రాంగణం శివ నామస్మరణతో మార్మోగింది. ఆలయ అర్చకులు వి.శంకరం, చిదంబరం, కృష్ణల ఆధ్వర్యంలో కల్యాణాన్ని నిర్వహించారు. అనంతరం ప్రసాద వితరణ చేశారు.